వైకుంఠ ఏకాదశికి ఆలయాల ముస్తాబు





గుడిపాటిగడ్డ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ఏర్పాట్లు చేసిన దృశ్యం, అభిషేకానికి పండ్ల రసాలు తయారు చేస్తున్న మహిళలు, సంజీవనగర్ రామాలయం వద్ద బారికేడ్ల ఏర్పాటు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గుడిపాటి గడ్డ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి దర్శనానికి సుమారు 20వేల మంది దర్శనానికి వస్తారని, వారికి అనుకూలంగా భారీ క్యూలైన్లను ఏర్పాటు చేసినట్లు ఈవో లక్ష్మినారాయణ తెలిపారు. తెల్లవారుజామున 4గంటలకు ప్రారంభమై రాత్రి 9గంటల వరకు దర్శనాలు జరుగుతాయన్నారు. ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శనానికి ఏర్పాటు చేశామన్నారు.

సంజీవనగర్ రామాలయంలో..

సంజీవనగర్ రామాలయంలో శ్రీదేవి, భూదేవి వేంకటేశ్వరస్వామి వారిని యాలకులతో సుగుంధ వేంకటేశ్వరస్వామిగా అలంకరిస్తామని నిర్వాహకులు తెలిపారు. స్వామి వారి గర్భాలయంలో పూలు, పండ్లతో విశేషాలంకరణతో పాటు భక్తుల దర్శనార్థం కోసం ఉత్తర ద్వారం ఏర్పాటు చేశామని, అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. విశేష పూజల నిర్వహించి భక్తుల దర్శనార్థం తెల్లవారుజామున 4 నుంచి రాత్రి 10గంటలకు వరకు స్వామి వారి దర్శించుకోవచ్చన్నారు. దేవస్థానాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. అలాగే.. బాలాజీ కల్యాణ మండపంలో భారీ క్యూలైన్లను ఏర్పాటు చేశారు. ఉదయమే 5గంటల నుంచి రాత్రి 9గంటల వరకు స్వామి వారిని దర్శించుకోవచ్చన్నారు. ద్వాదశి రోజున భక్తులతో లక్ష తులసీ దళార్చన, పుష్పాభిషేకాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి.

వైకుంఠ ఏకాదశి ఏర్పాట్ల పరిశీలన



ఉత్తర ద్వార దర్శన ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ రవికుమార్

రుద్రవరం: స్థానిక అప్పనపల్లె దారిలో వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో గురువారం వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా దర్శనానికి తరలి వచ్చే భక్తులకు తగిన ఏర్పాట్లు చేపట్టారు. గురువారం ఆలయ నిర్వాకులు మధుసూదన్ రెడ్డి, రంగనాయకులు, నరసింహ, ఓబులయ్య ఆధ్వర్యంలో వివిధ పనులు చేపట్టారు. ఇప్పటికే షామియానాలు, పార్కింగ్‌కు స్థల కేటాయింపు చేశారు. ఇక ఆలయ అంతర్భాగంలో ఉత్తర ద్వార దర్శనానికి చర్యలు చేపట్టారు. ఆళ్లగడ్డ డీఎస్పీ రవికుమార్, శిరివెళ్ల సీఐ వంశీధర్ ఆలయం వద్దకు చేరుకొని ఏర్పాట్లను పరిశీలించి ఆలయ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అన్నదాన వసతి ఆలయం వద్ద కాకుండా పక్కన ఏర్పాటు చేయాలని చెప్పారు. గురువారం తెల్లవారు జామున 12 గంటల నుంచి స్వామి వారి అభిషేకం పూజలు, ప్రతేక అలంకారం చేపడతామని,3 గంటలకు స్వామివారిని ఉత్తర ద్వారంలో ఏర్పాటు చేసిన వేదికపై కొలువుదీర్చి హారతి, పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం భక్తులను దర్శనానికి అనుమతిస్తామని అర్చకులు వారణాశి గోపీశర్మ తెలిపారు.

రోజాకుంటలోని..

రోజాకుంటలోని నాగులకుంట దేవాలయంలో శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి తెల్లవారుజామున 1 గంట నుంచి అభిషేకాలు అనంతరం భక్తులను దర్శనానికి అనుమతిమస్తామని చెప్పారు. చిత్తలూరి వీధిలో శ్రీభజన మందిరం పద్మావతినగర్‌లోని శ్రీకృష్ణమందిరం, మద్దూరు నగర్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం, తెలుగుపేటలోని శ్రీమద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో అన్ని ఏర్పాట్లు చేశారు.

నేడు మెగా మేళా

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఈనెల 10వ తేదీన మెగా మేళా నిర్వహిస్తున్నట్లు కమిషనర్ నిరంజన్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా ఆధ్వర్యంలో వివిధ రకాలైన సేవలు అందించే ప్లంబర్, కార్పెంటర్, ఎలక్ట్రీషియన్, ఏసీ, గీజర్, టీవీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్‌మిషన్ రిపేరీ చేసేవారు, బ్యూటీషియన్, పెయింటర్, మొదలైన సేవలు అందించే వారందరికీ నైపుణ్యాభివృద్ధి శిక్షణ ద్వారా శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్‌తో పాటు అర్హత పొందిన వారికి హామ్ ట్రయిగిల్ ఫ్లాట్‌ఫాం ద్వారా ఆన్‌బోర్డింగ్ చేసేందుకు జీవనోపాధి కల్పించబడుతుందన్నారు. అర్హులైన అభ్యర్థులు మున్సిపల్ కార్యాలయంలో జరిగే మేళాలో పాల్గొని వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు సుజాత టీఎంసీ సెల్: 7901610348, శోభా సీఎంఎం సెల్ : 7901610400 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పల్వరైజర్ మిషన్‌లో పడి మహిళకు తీవ్రగాయాలు

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని బొగ్గులైన్ వీధిలోని గోకుల్ దాల్‌మిల్‌లో పనిచేస్తున్న రాజేశ్వరి ప్రమాదవశాత్తు పల్వరైజర్ మిషన్‌లో పడి గురువారం తీవ్రగాయాల పాలైంది. అవుట్ పోస్ట్ పోలీసుల సమాచారం మేరకు.. నంద్యాల మండలం చాపిరేవుల గ్రామానికి చెందిన రాజేశ్వరి కొంత కాలంగా దాల్‌మిల్‌లో రోజువారి కూలీగా పనిచేస్తుంది. పనుల్లో భాగంగా పల్వరైజర్ మిషన్ వద్ద పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు అందులో పడిపోయింది. గమనించిన తోటి కూలీలు రాజేశ్వరిని బయటికి తీసి స్థానిక ఉదాయనంద ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు మెరుగైన చికిత్స అందిస్తున్నారు. బంధువుల ఫిర్యాదు మేరకూ త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు



బాలికోన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాలు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం మహిళా సాధికారత విభాగం, సాంస్కృతిక కమిటీ సంయుక్తంగా సంక్రాంతి సంబరాల్లో భాగంగా ముగ్గుల పోటీలను నిర్వహించారు. ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి అధ్యక్షతన ముగ్గుల పోటీలు నిర్వహించి సర్టిఫికెట్లను అందజేశారు. బాలా అకాడమీ పాఠశాలలో ప్రిన్సిపాల్ మాధవీలత ఆధ్వర్యంలో పిల్లలకు బోగిపళ్లు పోశారు.

సర్పంచ్‌ల వేతనాల మాటేమిటి?



మాట్లాడుతున్న ఎంపీపీ అమర్‌నాథ్ రెడ్డి

దొర్నిపాడు: మండలంలోని సర్పంచ్‌లకు వేతనాలు చెల్లించలేదని, ఎప్పుడు చెల్లిస్తారనేది స్పష్టత లేదని, వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని అమ్మిరెడ్డినగరం సర్పంచి లక్కుమాధవీ కోరారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యలయంలో ఎంపీపీ గోపవరం అమర్‌నాథ్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా.. వివిధ శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. అనంతరం..స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిర్మాణానికి స్థలం దానం చేసి పయిడేల లక్ష్మినారాయణరెడ్డి పేరును స్కూల్‌కు పెట్టాలని జెడ్పీటీసీ శకుంతల కోరారు. విద్యాశాఖకు సంబంధించి చర్చకు రాగా ఎంఈఓ మనోహర్‌రెడ్డి మాట్లాడుతుండగా హైస్కూల్‌కు లక్ష్మినారాయణరెడ్డి పేరు విషయం ఎంతవరకు వచ్చిందని ప్రశ్నించారు. అందుకు ఆయన బదులిస్తూ స్థలదానం చేసిన విషయం వాస్తవమేనని సబ్‌రిజిస్టర్ రికార్డుల్లో ఆ స్థలం ప్రభుత్వ భూమిని అని ఉండటంలో సమస్య వస్తుందని బదులిచ్చారు. అనంతరం తహసీల్దార్ సుభద్ర మాట్లాడుతూ ప్రస్తుతం పైలెట్ ప్రాజెక్టు కింద అర్జునాపురంలో భూ రీసర్వే చేస్తున్నట్లు చెప్పారు. తాగునీటి గురించి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుప్రియ మాట్లాడుతుండగా కొండాపురం సర్పంచ్ మాధవీలత మాట్లాడుతూ జలాశయాల నుంచి నీరు వచ్చే సరికి వేసవి వెళ్లిపోతుందని, వేసవిలో నీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే రవాణా, రోడ్డు భవనాలు, శాఖలకు సంబంధించిన అధికారులు రాలేదు. రైతులు రెండో పంటగా రైతులు ఆవాలు సాగుచేసుకోవాలని ఏఓ ప్రమీల సూచించారు. విద్యుత్ శాఖ ఏఈ రామ్మోహన్ సూర్యఘర్ పథకంపై వివరించారు. మండలంలోని రెండు పీహెచ్‌సీల్లో నలుగురు వైద్యులుండగా కేవలం సూపర్‌వైజర్‌ను మండల సమావేశానికి పంపడం చర్చనీయాంశంగా మారింది. ఎంపీడీఓ సావిత్రి, గృహనిర్మాణ శాఖ ఏఈ బ్రహ్మం, పీఆర్ ఏఈ గౌస్, ఏపీఓ గంగన్న, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభాకరమ్మ ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

అలా ముగించారు!

- మొక్కుబడిగా మండల సర్వసభ్య సమావేశం
- ప్రస్తావనకురాని ప్రజా సమస్యలు
- ప్రగతి నివేదికలు చదవడానికే పరిమితమైన అధికారులు
- పంట నష్టంపై కనీసం చర్చ చేపట్టని వైనం



ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మకు సమాధానమిస్తున్న ట్రాన్స్‌కో ఏఈ గుర్రప్ప

ఉయ్యాలవాడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు అజెండాలో పొందు పరిచిన అంశాల్లో భాగంగా వ్యవసాయ శాఖ, విద్యుత్, రెవెన్యూ, తదితర శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి సమావేశానికి వచ్చిన ప్రజా ప్రతినిధులకు వినిపించారు. సమావేశంలో గ్రామాల్లో నెలకొన్న వివిధ సమస్యలు, పంట నష్టపోయిన రైతులకు అందాల్సిన పంట నష్ట పరిహారం, ఇటీవల తుపాన్ ప్రభావంతో పెద్ద ఎత్తున మిరప, సీడుపత్తి, శనగ, మినుము, వివిధ రకాల పంటలు పూర్తిస్థాయిలో దెబ్బతిన్నప్పటికీ ప్రధాన అంశాలపై ప్రజాప్రతినిధులు కూడా అధికారుల దృష్టికి తీసుక రాకపోవడం విచారకరం. దీంతో అధికారులు సైతం తమకు పట్టనట్లు సభను మమ అనిపించారు. తహసీల్దార్ శ్రీనివాసులు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

చంద్రబాబు అసమర్థత వల్లే తొక్కిసలాట

బొమ్మలసత్రం: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అసమర్థత వల్లే తిరుపతిలో తొక్కిసలాట ఘటన చోటుచేసుకుందని ఏపీఎస్పీడీసీఎల్ మాజీ డైరెక్టర్ డాక్టర్ శశికళారెడ్డి అన్నారు. గురువారం నంద్యాలలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శన టోకెన్ల జారీలో ఆరుగురు తొక్కిసలాటలో మృతిచెందటం బాధాకరమన్నారు. చంద్రబాబు తన అసమర్థతను కప్పి పుచ్చుకునేందుకు గత ప్రభుత్వంలోనే తిరుపతిలో టోకన్ల జారీ ప్రక్రియ చేపట్టారని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మరి ఐదేళ్లలో లేని అపశృతి ఇప్పుడే జరగటానికి కారణాలు చెప్పాలని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం నియమించిన టీటీడీ చైర్మన్, ప్రభుత్వ అధికారుల సమన్వయ లోపమే తొక్కిసలాటకు కారణమని తెలుస్తుందన్నారు.

బాధ్యతలు స్వీకరించిన రూరల్ సీఐ



మురళీధర్‌రెడ్డి

ఆళ్లగడ్డ: రూరల్ సీఐగా మురళీధర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న కంబగిరిరాముడు బదిలీపై నంద్యాల త్రీ టౌన్‌కు వెళ్లారు. ఆయన స్థానంలో ప్రభుత్వం మురళీధర్‌రెడ్డిని నియమించడంతో గురువారం సీఐ కార్యాలయం చేరుకుని బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ తాను గతంలో ఆళ్లగడ్డ, చాగలమర్రిలో ఎస్ఐగా విధులు నిర్వహించడంతో నియోజకవర్గంపై అవగాహన ఉందన్నారు.

నేడు కల్యాణోత్సవం

దొర్నిపాడు: మండలంలోని చాకరాజువేముల గ్రామంలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఈఓ చంద్రుడు, ధర్మకర్త గోపాల్‌నాయుడు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం గణపతి పూజ, పుణ్యవచనం కన్యాదానం, మహాసంకల్పం, మాంగళ్యధారణ పూజ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

నేటి నుంచి గోకులాల ప్రారంభోత్సవం

నంద్యాల(అర్బన్): ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద మండలంలోని గ్రామాల్లో నిర్మించిన గోకులం షెడ్ల ప్రారంభోత్సవ కార్యక్రమాలను 10, 11 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుగుణశ్రీ గురువారం తెలి పారు. 10న కానాల(హెచ్ఎస్ కొట్టాల), పాండురంగాపురం, మిట్నాల, పుసులూరు, పోలూరు గ్రామా ల్లో, 11న కొత్తపల్లె, పెద్దకొట్టాల గ్రామాల్లో గోకులం షెడ్ల ప్రారంభోత్సవాలు ఉంటాయని చెప్పారు. ప్రారంభోత్సవానికి జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచ్‌లు, గ్రామ నాయకులు సంబంధిత అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

వాహనాల తనిఖీ

చాగలమర్రి: రికార్డులు సరిగ్గాలేని వాహనాలకు రూ.1.50 లక్షల జరిమానా విధించినట్లు నంద్యాల మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవిశంకర్ నాయక్ తెలిపారు. గురువారం చాగలమర్రిలో వాహనాల తనిఖీ చేపట్టారు.

వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోండి

నంద్యాల(వ్యవసాయం): వివేకానందుడి జీవితం నేటి యువతకు ఆదర్శమని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి విజయ్‌కుమార్, శ్యాంసుందర్‌లాల్ పేర్కొన్నారు. గురువారం శ్రీగణేష్ మహోత్సవ కేంద్ర సమితి ఆధ్వర్యంలో వివేకానందుడి జయంతి వారోత్సవాలను పురస్కరించుకొని కళాశాల, పాఠశాల విద్యార్థులతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వివేకానంద సెంటర్‌లోని వికానందుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వీధి వ్యాపారుల సంక్షేమానికి కృషి

నంద్యాల జిల్లా చిన్న,వీధి వ్యాపారుల సంక్షేమానికి కృషి చేస్తానని న్యాయ శాఖ మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. వ్యాపారుల సంఘం ఆధ్వర్యంలో గురువారం మంత్రిని కలిసి వినతి పత్రం అందజేసి మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడు మహబూబ్‌బాషా, ఉమామహేష్, అజీజ్‌ఖాన్, వెంకటరమణ, అలీమ్, షేక్ ఖాజాహుసేన్, వెంకటేశ్వర్లు, సంధ్యారాణి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో జాబ్‌మేళా



ఉద్యోగాలకు ఎంపికైన పాలిటెక్నిక్ విద్యార్థులు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ఈఎస్సీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం నిర్వహించిన ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను ప్రిన్సిపాల్ శ్రీనివాసప్రసాద్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పాలిటెక్నిక్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు 170 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. అంతర్జాతీయ సంస్థ రాయల్ ఎన్‌ఫీల్డ్ చెన్నైలో పనిచేసేందుకు విద్యార్థుల నైపుణ్యాలను, సామర్థ్యాలను అంచనా వేసేందుకు పోటీ పరీక్షలు, ముఖాముఖి ఇంటర్వ్యూలు చేశారన్నారు. మెకానిక్ ఇంజినీరింగ్ 37, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్ 69, ఎలక్ట్రికల్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ 71 మంది ఎంపికయ్యారన్నారు. సంస్థ ప్రతినిధులు ప్రవీణ్‌కుమార్, టీవీఎస్ కళాశాల ప్లేస్‌మెంట్ కో ఆర్డినేటర్ ఈశ్వరయ్య, ఎండీ షఫీ, షరీఫ్, ట్రిపుల్‌ఈ హెచ్ఓడీ రాజేష్, శ్రీనివాసరెడ్డి, రఘునాథరెడ్డి, సంజీవరాయుడు, జనరల్ సెక్షన్ హెచ్ఓడీ డాక్టర్ సురేష్‌బాబు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ.. నైపుణ్యాలగడ్డ

- నైపుణ్యంతో బండరాళ్లకు జీవం పోస్తున్న శిల్పకారులు
- అంతర్జాతీయ ఖ్యాతిని సొంతం చేసుకున్న ఇక్కడి శిల్పులు
- పట్టణంలో విస్తరిస్తున్న ప్రైవేట్ వైద్యశాలలు
- అందుబాటులో ఆధునిక వైద్యం

ఆళ్లగడ్డ: విద్య, వైద్య వ్యాపార రంగాల్లో రోజురోజుకూ అభివృద్ధి చెందుతుండటంతో ఆళ్లగడ్డ పట్టణం వ్యాపార రంగానికి అడ్డాగా మారుతోంది. ఇతర ప్రాంతాలతో పోలిస్తే ఇక్కడ శిల్పులు చెక్కుతున్న దేవతా మూర్తుల విగ్రహాలు దేశ విదేశాల్లో పూజలు అందుకుంటున్నారు. ప్రైవేటు వైద్యులు కార్పొరేట్ వైద్యశాలలకు ధీటుగా వైద్యశాలలను ఏర్పాటు చేస్తుండటంతో కొత్త పుంతలను తొక్కుతోంది

10 వేల మందికి ఉపాధి..

ఆళ్లగడ్డ నియోజక వర్గ పరిధిలోని గుంప్రామాన్ దిన్నె గ్రామానికి చెందిన దురిగడ్డ వంశీయులు సుమార 300 సంవత్సరాల క్రితమే ఆ గ్రామంలో రాతి శిల్పాల తయారీకి శ్రీకారం చుట్టినట్లు చరిత్ర. అలా వీరి వంశీయులు సుమారు 70 సంవత్సరాల క్రితం ఆళ్లగడ్డ పట్టణానికి వలస వచ్చి శిల్పాలను చెక్కుతూ అందులో మెలకువలను పెంపొందించుకుంటూ కొద్ది కాలనికి ఒక శిల్పశాలను ఏర్పాటు చేశారు. అంచలంచెలుగా ఎదుగుతూ నేడు 70 దాకా శిల్ప కళా మందిరాలు ఏర్పాటు చేసుకున్నారు. దీంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 10 వేల మందికి ఉపాధి లభిస్తోంది. ఇక్కడ తయారు చేసిన విగ్రహాలు చైనా, రష్యా, శ్రీలంక, జపాన్ తదితర దేశాలకు తరలిస్తూ అనేక మంది ఉపాధి పొందుతున్నారు.

ఆధునిక టెక్నాలజీతో వ్యాపారం..

గతంలో వీటిని కొనుగోలు చేసేందుకు వినియోగదారులను ఇక్కడకు తీసుకొచ్చే మార్గం తెలియక కులవృత్తితో భుక్తి జరగక వీటినే నమ్ముకున్న అనేక కుటుంబాలు ఇబ్బంది పడేవారు. ఇలాంటి సమయంలో ఇంటర్నెట్ వీరి చరిత్రను మార్చేసింది. ఇంటర్నెట్‌ను అందిపుచ్చుకున్న యువత ఇప్పుడు దేశ విదేశాలకు ఇక్కడి విగ్రహాలు ఎగుమతి చేస్తూ ఉపాధి పొందుతూ ఏడాదికి సుమారు రూ.వెయ్యి కోట్లకు పైగా లావాదేవాలు నడుపుతున్నారు. ప్రస్తుతం ఇంటీరియల్ డెకరేషన్‌లో కూడా శిల్పాల ప్రాధాన్యం పెరగడంతో మహిళలు వాటి పై దృష్టి కేంద్రికరించి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. ఇళ్లల్లో డైనింగ్ టేబుల్, కార్నర్ స్టాచ్యూలు, గార్డెన్‌లో రాతి బెంచ్‌లు, మండపాలు పెట్టుకుంటున్నారు. ఈ ట్రెండ్ కూడా శిల్ప కళాకారులకు మంచి ఉపాధిగా మారింది.



ప్రైవేటు వైద్య రంగంలో కొత్తపుంతలు..

ఒకప్పుడు చిన్నచిన్న ప్రైవేటు వైద్యశాలకే పరిమితమైన ఆళ్లగడ్డ పట్టణం నేడు కార్పొరేట్ వైద్యశాలకు ధీటుగా వైద్యశాలలు వెలుస్తున్నాయి. నంద్యాల పట్టణానికి దగ్గరలో ఉండటంతో ఒకప్పుడు ఈ ప్రాంత ప్రజలు ఏ చిన్న జబ్బుచేసినా స్పెషలిస్ట్ డాక్టర్‌ను సంప్రదించాలంటే కర్నూలు, నంద్యాల, ప్రొద్దుటూరు పట్టణాలకు వెళ్లేవారు. కొంతకాలంగా ఆళ్లగడ్డ పట్టణంలో స్పెషలిస్టు వైద్యులు వైద్యశాలలు ఏర్పాటు చేస్తుండటం, నిత్యం అందుబాటులో ఉండటంతో వైద్య సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో బయటి ప్రాంతాలకు వెళ్లకుండా రోగులు ఇక్కడే చికిత్స పొందుతున్నారు.అత్యవసర వైద్యం, అవసరమైన సాంకేతిక అందుబాటులోకి వచ్చింది. ఆయుర్వేద పంచకర్మ వైద్యం కూడా అందుబాటులో ఉండటంతో నియోజకవర్గం ప్రజలకు భరోసా లభించినట్లు అయింది.

రాతిని శిలగా మార్చి..



శిల్పాలు చెక్కుతున్న శిల్పకారులు

మనిషిని దేవుడు సృష్టించినట్లు పలువురి విశ్వాసం. అయితే దేవుడి రూపు ఎలా ఉంటుందో ఎవరికీ తెలియదు. మనం కొలిచే దేవుడు ఇలాగే ఉంటాడు అని నిర్దిష్టమైన ప్రమాణాలు ఏవీ లేనప్పటికీ .. పేరు తలవగానే ఆ రూపం కళ్లముందు కదలాడే విధంగా శిలా ప్రతిమలను తీర్చిదిద్దుతుతున్నారు శిల్పకారులు. తమ పనితనంతో మయుడిని కూడా వీరు మరిపించటంలో నేర్పరులంటే అతిశయోక్తి కాదు. ఉలితో అద్భుత శిల్పాలను చెక్కే శిల్పకారులకు నిలయంగా భాసిల్లుతోంది ఆళ్లగడ్డ. నంద్యాల నుంచి ఆళ్లగడ్డ జాతీయ రహదారిలో వెళ్తూ ఆళ్లగడ్డలో అడుగు పెడితే.. రహదారికి ఇరువైపులా శాలివాహనులు, కాకతీయుల కాలం నాటి ప్రాచీన శిల్పకళా చాతుర్యం ఉట్టిపడుతుంటోంది. ఆరు అంగుళాల నుంచి అరవై అడుగుల వరకు అవసరమైతే ఇంకా ఎత్తైన శిల్పాలు చెక్కడంలో ఇక్కడి శిల్పులు సిద్ధహస్తులు. వీరు రూపొందించిన వివిధ దేవతా మూర్తులు దేశ విదేశాల్లోని ప్రముఖ దేవాలయాల్లో కొలువై.. ప్రముఖుల చేత శభాష్‌అనిపించుకుంటున్నారు.